క్లుప్తంగా

సాలూరులో క్యాండిల్ ర్యాలీ



ఏరియా ఆస్పత్రి వద్ద క్యాండిల్ ర్యాలీ చేస్తున్న సిబ్బంది

సాలూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో 41వ అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డేని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీతో చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యుల బాధను నయం చేద్దాం.. అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుమలాదేవి, ఐసీడీసీ స్టాఫ్, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యం

సీతానగరం: ఉపాధి హామీ పనుల్లో భాగంగా చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఉపాధి ఏపీఓ భాను అన్నారు. వారం రోజులుగా అంటిపేట, సుమిత్రాపురం, వెంకటాపురం, వీబీపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పథకంలో భాగంగా వేతనదారులకు పనులు కల్పిస్తూ.. వ్యవసాయ భూములకు ఉపయోగపడే గోర్జిలు, చెరువులు, మెట్ట భూముల్లో గట్ల అభివృద్ధి వంటి పనులు చేపడతామన్నారు. మండలంలో రోజుకు సుమారు 12 వేల మంది వేతనదారులు పనుల్లో పాల్గొంటున్నారని తెలిపారు.

ముడి సరుకు సిద్ధం..



పైపులను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

సీతానగరం: మండలంలోని పెదబోగిలి పంచాయతీ బుడ్డిపేటలో ఇంటింటి కుళాయి పథకం పనులు ప్రారంభించడానికి అవసరమైన ముడిసరుకు సిద్ధంగా ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్. పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. చినబోగిలిలో ఇంటింటి కుళాయి పథకం పనులు పూర్తి కావొచ్చాయని, త్వరలోనే ట్రయల్ రన్ నిర్వహిస్తామన్నారు. బుడ్డిపేటలో కూడా త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

చిత్రలేఖనంపై శిక్షణ



చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తున్న డ్రాయింగ్ టీచర్

పాలకొండ రూరల్: చదువుతో పాటు విద్యార్థులు చిత్రలేఖనంపై ఆసక్తి చూపాలని తంపటిపల్లి డ్రాయింగ్ ఉపాధ్యాయుడు జి.మరళి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనంలో మెళకువలు నేర్పారు. అంకెలతో బొమ్మలు ఎలా వేయాలో విద్యార్థులకు నేర్పించారు. గ్రంథాలయ అధికారి బబ్బూరి గణేష్‌బాబు చరిత్రకారులు, రాజరికపు వ్యవస్థ, స్వతంత్ర పోరాటాలు వంటి స్ఫూర్తిదాయక కథనాలను వివరించారు. రాత పరీక్షలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

నేటి నుంచి వెంపడాంలో పైడితల్లి పండగ



వెంపడాం పైడితల్లి అమ్మవారు

పూసపాటిరేగ: మండలంలోని వెంపడాం గ్రామంలో ఈనెల 20, 21, 22 తేదీల్లో పైడితల్లి అమ్మవారి పండగ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 20న తొలేళ్ల మహోత్సవం, 21న అంజలి రథోత్సవం, 22న కనుమ పండగ నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పండగకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది ప్రజలు తరలివస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విద్యుత్ కాంతులతో పండగను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

అందుబాటులో టెన్త్ స్టడీ మెటీరియల్

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో దాతల సహకారంతో సమకూర్చిన టెన్త్ స్టడీ మెటీరియల్ ఇప్పుడు అందుబాటులో ఉందని లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ ఆదివారం తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదవనున్న విద్యార్థులంతా ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఎస్సీ, సివిల్స్, పోలీస్, బ్యాంక్ ఉద్యోగాలకు సంబంధించిన పుస్తకాలు కూడా ఉన్నాయని, గ్రంథాలయానికి వచ్చి వీటిని ఉపయోగించుకోవాలన్నారు.

తస్మాత్ జాగ్రత్త..!



పిడుగు సమయంలో ఆకాశం నుంచి వచ్చే మెరుపు

- వర్షాకాలంలో పిడుగుల బెడద
- తీవ్ర భయాందోళనలో ప్రజలు
- జాగ్రత్తగా ఉండాలని వాతావరణ నిపుణుల సూచన

గరుగుబిల్లి:

వర్షాకాలం వచ్చిందంటే చాలు ఈదురుగాలులు..వీటికి తోడు పిడుగులు ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తాయి. ఈ నేపథ్యంలో వర్షం కురిసే సమయంలో వీలైనంత వరకు బయటకు రాకపోతేనే మంచిదని వాతావరణ నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. మేఘావృతమై ఈదురుగాలులు వచ్చినప్పుడు అప్రమత్తం కావాలని, చిన్నపాటి వర్షం కురవడం ప్రారంభమైనప్పుడే సురక్షిత ప్రాంతాలకు సూచిస్తున్నారు. చల్లబడిన మేఘం నుంచి విడిపోయిన మంచుకణాలు ఈదురుగాలుల కారణంగా రాపిడికి గురవ్వడంతో పిడుగులు పడతాయని, ఆ సమయంలో ఎత్తైన ప్రదేశాలు, చెట్లు కింద ఉండవద్దంటున్నారు. పిడుగుపాటుకు గురై ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు, ఆస్తి నష్టం సంభవించిన ఘటనలు కోకొల్లలు అని, చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే పిడుగుల బారిన పడకుండా తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- ఉరుములు, మెరుపులు, పిడుగులు పడే సమయంలో ల్యాండ్‌లైన్ ఫోన్‌లో మాట్లాడకూడదు.
- ల్యాండ్‌లైన్ ఫోన్‌కు బదులు కార్డ్‌లెస్, సెల్‌ఫోన్ గానీ వాడవచ్చు. అదికూడా ఇంట్లో ఉండి వాడాలి.
- ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో టీవీ చూడడం ప్రమాదకరం. అంతేకాకుండా స్విచ్‌బోర్డుల నుంచి ప్లగ్‌లు తీసివేయాలి. లేదంటే ఎలక్ట్రిక్ వస్తువులన్నీ పాడయ్యే ప్రమాదం ఉంది.
- ఇంటి కిటికీలు, తలుపుల దగ్గర నిలబడి బయటకు చూడడం అంత మంచిది కాదు.
- ఉరుములు, మెరుపులు సమయంలో చెట్ల కిందకు అస్సలు వెళ్లకూడదు.
- పిడుగులు పడే సమయంలో ఎత్తు తక్కువగా ఉండే ప్రదేశాల్లో తల కిందకు వంచి చెవులు, కళ్లు మూసుకుని కూర్చోవాలి.
- పెంపుడు జంతువులైన ఆవులు, గేదెలు, కుక్కలు లాంటి వాటిని బయట వదిలేయకుండా షెడ్లలోనే ఉంచాలి.
- విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద ఉండొద్దు.
- ఉరుముల సమయంలో మన శరీరం జలదరింపునకు గురవ్వడం, వెంట్రుకలు నిక్కపొడుచుకోవడం వంటి సంకేతాలు కనిపిస్తే పిడుగు మీ దగ్గరలో పడుతున్నట్లు గుర్తించాలి.

పుచ్చలపల్లికి ఘనంగా నివాళులు



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



సాలూరు: పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్‌వై నాయుడు, నాయకులు

సీతానగరం: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి మండలంలోని ఎస్‌డబ్ల్యూపీసీ ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు రెడ్డి లక్ష్మున్నాయుడు, సీఐటీయూ మండల కార్యదర్శి జి.వెంకటరమణ మాట్లాడుతూ, 1913 మే 1న జన్మించిన సుందరయ్య తన జీవితాన్ని పేదలు, కష్టజీవులకు అంకితం చేశారని కొనియాడారు. అలాగే కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని చెప్పారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడన్నారు. సుందరయ్యను యువకులు, మహిళలు, ఉద్యమ పోరాట అభిమానులు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు డి. నారాయణరావు, సీహెచ్ కృష్ణ, బి. అప్పారావు, జె.గౌరు, శంకరరావు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు ..

సాలూరు: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎన్‌వై నాయుడు అన్నారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజల కోసం ఆయన చేసిన నిస్వార్థ కృషి చరిత్ర పుటల్లో నిలిచిపోతుందన్నారు. శాసనసభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా ఆయన విశేష సేవలు అందించారని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, సీత, స్వప్న, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సీఓఈలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

సీతంపేట: కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ)లో 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు జోగింపేట ఎస్‌ఓఈలో సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు మల్లి సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరేందుకు అర్హత సాధించిన విద్యార్థులు తమ ఒరిజనల్ షర్టిఫికెట్లతో ఉదయం 9 గంటలకు కళాశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9440391360, 9392855636కు ఫోన్ చేయాలని సూచించారు.

ఊరటనిచ్చిన వర్షం

పాలకొండ రూరల్: ఉదయం నుంచి వేసవి తాపంతో తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలకు ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం ఊరట నిచ్చింది. పగటి పూట దాదాపు 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకావటంతో పాటు వేడి గాలులు తోడవ్వడంతో ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. తాజాగా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడటంతో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందుతున్నారు. మరోవైపు ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న రైతులకు ఈ వర్షాలు అనుకూలంగా ఉంటాయని వ్యవసాయశాఖ సిబ్బంది అంటున్నారు. వేసవి దుక్కులతో పాటు పచ్చిరొట్ట సాగుకు ఉపయోగకరంగా ఉంటాయంటున్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 50 శాతం రాయితీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్నట్లు ఏఓ వాహిని తెలిపారు. కావాల్సిన వారు సమీపంలోని ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అకాల వర్షాలతో రబీ రైతులకు కష్టాలు

భామిని: మండలంలో కురుస్తున్న అకాల వర్షాలతో రబీ రైతులకు కష్టాలు వచ్చాయి. పలుచోట్ల రబీ వరికోతలు నిలిచిపోగా.. ఇప్పటికే కోతలు, నూర్పులు పూర్తిచేసిన రైతులు ధాన్యం తడిచిపోకుండా తగిన రక్షణ చర్యలు చేపడుతున్నారు. రోడ్డుపై వేసిన ధాన్యం నిల్వలు వర్షానికి తడిచి రంగుమారే అవకాశం ఉందని, అలాగే వర్షాల కారణంగా రబీ ధాన్యం సేకరణ ఆలస్యమయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

ఘనజీవామృతం తయారీపై అవగాహన



ఘనజీవామృతం తయారీనికి వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సంతకవిటి: మండలంలోని గోవిందపురం గ్రామంలో ఘనజీవామృతం తయారీపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆదివారం అవగాహన కల్పించారు. 400 కిలోల ఆవుపేడ, 10 లీటర్ల ఆవుమూత్రం, 2 కిలోల బెల్లం, మరో 2 కిలోల పప్పు పిండి, గుప్పెడు మన్నును కలిపి ఉండలుగా చేసుకుని, వాటిని నీడలో ఆరబెట్టాలి. ఇలా తయారు చేసుకున్న ఘనజీవామృతాన్ని బాగా దున్నిన పొలంలో వేసుకుంటే నేలకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా అందుతాయని తెలిపారు. ఆ తర్వాత వేసుకునే పంటలు బాగా పండి, అధిక దిగుబడులను ఇస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారు చేసుకునే ఘనజీవామృతం, ద్రవజీవామృతం, అగ్నిఅస్త్రం వంటి ఎరువులు పంటలకు బాగా ఉపకరిస్తాయన్నారు. రైతులంతా ప్రకృతి సేద్యం చేసి, ఆరోగ్యవంతమైన పంటలు అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాత్రుని వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి



కొమిరలో విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులంతా విత్తనాల కోసం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని కొమిర, లక్ష్మీపురం, చాటాయవలస తదితర గ్రామాల్లో జరుగుతున్న విత్తనాల నిమిత్తం రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన ఆదివారం పరిశీలించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేసి, ఏ రైతుకు ఏ రకమైన విత్తనాలు కావాలో నమోదు చేసుకోవాలని, వాటిని సకాలంలో వారికి అందివ్వాలన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ద్వారా మండలానికి ఎంత మొత్తంలో విత్తనాలు కావాలన్న విషయం తెలుస్తుందన్నారు. అన్ని గ్రామాల ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట సర్పంచ్ పాడి లక్ష్మంనాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కేశవరావు తదితరులు ఉన్నారు.

వైభవంగా సనారివిశ్వేశ్వర స్వామి కల్యాణం



టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీవారి ఆలయం



పాలకొండ రూరల్: సనారివిశ్వేశ్వర స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

పాలకొండ రూరల్:

రాష్ట్రంలో ఏకైక ఆలయమైన అన్నపూర్ణ సహిత శ్రీమద్ విరాట్ సనారివిశ్వేశ్వర అవదూత ఆలయంలో లోక కల్యాణార్థం సామివారి కల్యాణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కోమటిపేటలో స్వయంభూగా వెలసిన స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అర్చకులు ప్రసాద్‌పాడీ నేతృత్వంలో స్వామివారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పట్టణంలోని స్వర్ణకారులు, పలువురు దంపతులు ఈ వేడుకలో పాల్గొని మొక్కులు చెల్లించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోటదుర్గమ్మకు సంబర నీరాజనం

పాలకొండ రూరల్: భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారం కోటదుర్గమ్మ దేవస్థానంకు భక్తులు పోటెత్తారు. ఘటాలతో కాలినడకన అమవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు. పసుపు నీటితో అమ్మవారికి అభిషేకం చేశారు. బిందె దీపాలను, ప్రత్యేక ప్రసాదాలు, ఫలాలను అమ్మకు నివేదించారు. అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ నేతృత్వంలో అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. ఘటాల ఊరేగింపులో ఏర్పాటుచేసిన సాంప్రదాయ వేషధారణలు, డప్పువాయిద్యాలు ఆకట్టుకున్నాయి.

నేడు వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం

సీతంపేట: సీతంపేటలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలన్ని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, తోమాల, సహస్ర నమార్చన, నివేదన, ఉదయం 9 గంటల నుంచి విశేష కార్యక్రమాలు, విశ్వక్షేన ఆరాధన, పుణ్యాహావాచన, విశేష హోమాలు, పూర్ణాహుతి, ఉత్సవ మూర్తులకు అష్టోత్తర శత కలశస్నపన, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

కల్యాణం.. కమనీయం..



పంచముఖేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులు



విశేష పూజలందుకుంటున్న పంచముఖేశ్వర స్వామి

పట్టణంలోని పంచముఖేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఏకాదశి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. శివ నామస్మరణ మార్మోగడంతో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. – సాలూరు

వైభవంగా సత్యనారాయణస్వామి కల్యాణం



సత్యనారాయణ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని బగ్గందొరవలస – బళ్లకృష్ణాపురం జంక్షన్‌లో గల వెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో అర్చకుడు బి. వేణుగోపాలశర్మ ఆధ్వర్యంలో రమా సమేత సత్యనారాయణస్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు వేణుగోపాలశర్మ మాట్లాడుతూ.. ఆలయంలో ప్రతి ఏటా ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో వందలాది మంది భక్తులచే అభిషేకాలు, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. పూజలనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో బళ్లకృష్ణాపురం సర్పంచ్ ఎస్. సుశీల రామకృష్ణ, బగ్గందొరవలస సర్పంచ్ ఎ. నారాయణరావు, గెడ్డలుప్పి సర్పంచ్ ఎ. తిరుపతిరావు దంపతులతో పాటు కూర్మినాయుడు, సింహాచలం, జగన్నాథం, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులు సిద్ధం



ఆర్బీకేలో సిద్ధంగా ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు

సీతానగరం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో భూములను సారవంతం చేసేందుకు పచ్చిరొట్ట ఎరువులు రాయితీపై పంపిణీ చేసేందుకు సిద్ధం చేశామని ఏఓ ఎస్. అవినాష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు ముందుగా పచ్చిరొట్ట విత్తనాలు చల్లాలని సూచించారు. ఆర్‌బీకేల్లో 50 శాతం రాయితీపై వీటిని అందజేస్తున్నట్లు చెప్పారు. జీలుగ విత్తనాలు 10 కిలోల బ్యాగ్ ధర రూ. 880 కాగా రాయితీపై 440 రూపాయలకు.. కట్టిజనము పది కిలోల బ్యాగ్ కూడా రాయితీపై 440 రూపాయలకు.. పిల్లిపెసర 8 కిలోల ధర రూ. 1,072 కాగా రాయితీపై 536 రూపాయలకు విక్రయించనున్నట్లు చెప్పారు. అలాగే రైతులు మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

చెక్‌పోస్ట్‌ల కొనసాగింపు



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, నియోజకవర్గ సరిహద్దుల్లో ఏర్పాటుచేసిన పోలీస్ చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు కొనసాగుతాయని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. పాలకొండ–విశాఖ రహదారిలో చినమంగళాపురం వద్ద కొనసాగుతున్న చెక్‌పోస్టును ఆదివారం ఆయన పరిశీలించారు. అక్కడ జరుగుతున్న తనిఖీల తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలకొండ, సీతంపేట, బత్తిలి వద్ద అంతర్ జిల్లా, రాష్ట్రాల చెక్‌పోస్టులు కొనసాగుతున్నాయన్నారు. అలాగే సబ్‌డివిజన్ పరిధిలో 8 మండలాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. నిబంధనలు తప్పనిసరిగా అమలు చేసేలా సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వటం జరిగిందన్నారు. పరిమితికి మించి నగదు, బంగారు ఆభరణాలు తీసుకువెళ్లేవారు వాటిని సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని, లేదంటే వాటిని సీజ్ చేస్తామన్నారు. మద్యం, నిషేధిత పదార్థాలు రవాణా చేసినా, అవాంఛనీయ ఘటనలు, ఎన్నికల ఫలితాలపై బెట్టింగులకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామన్నారు.

కవ్వింపులకు పాల్పడితే చర్యలు తప్పవు



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ చంద్రమౌళి

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తికావచ్చినా కొన్ని గ్రామాల్లో కవ్వింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉందని, గ్రామాల్లో ఘర్షణలు సృష్టించేందుకు ప్రయత్నించేవారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ మీసాల చంద్రమౌళి హెచ్చరించారు. పాలకొండ, వీరఘట్టం మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు వచ్చేవరకూ ఎన్నికల కోడ్‌తో పాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పోలీసుల నిఘా కొనసాగుతోందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించేవారిపై కేసుల నమోదు చేస్తామన్నారు. గతంలో నేరచరిత్ర కలిగిన వారు, బైండవర్ కేసుల్లో నమోదైన వారు, యువత ఘర్షణలకు దూరంగా ఉండాలని సూచించారు. పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. పనుకువలస, తెట్టంగి, అవలంగి, తలవరం, బెజ్జి, స్థానిక పెద్దకాపువీధి, కస్పావీధి, గేదలవారి, కొత్తవీధుల్లో పర్యటించి ప్రజలకు పలు సూచనలు చేశారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో జరిగిన సీఆర్‌టీల రెగ్యులరైజేషన్‌కు రూ.2 కోట్లు వసూలు చేశారనే ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో ఆదివారం డిమాండ్ చేశారు. ముగ్గురు సీఆర్‌టీల నుంచి పార్వతీపురం ఐటీడీఏ డీడీ విభాగం అధికారులే డబ్బుల వసూలు చేశారన్న విషయం తెలిసిందన్నారు. తక్షణమే విచారణ చేపట్టి, అక్రమార్కుల గుట్టురట్టు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా బాలికల పాఠశాలల్లో పురుష ఉపాధ్యాయులను నియమించిన డీడీ, సూపరింటెండెంట్‌లపై చర్యలు తీసుకోవాలన్నారు.